# కాల్చుకుతినే... కారుణ్యం

కె. వి. రంగారావు

ప్రపంచంలోవున్న అనేకరకాలమంది భార్యలలో మా ఆవిడ ఒకర్తె. కొంతమంది భార్యలు అడక్కుండానే భర్తలకు సమస్త ఉపచారాలుచేస్తారు. కొంతమంది యేదికోరుతే అదేచెయ్యడం-లేకపోతే మానేయడం. మరికొందరు యీ చాకిరీచెయ్యడం విపరీతంగా చూపెడుతూ విసుగుకూడా కలిగిస్తారు. 'నాకేమీ చెయ్యనక్కరలేదులే. విసిగించిచంపకు' అని అనాలనిపిస్తుందికూడాను.

మాఆవిడ యీ చివరిరకంలో చేరుతుంది. ఉత్తప్పుడు యెన్నివిధాల నన్ను అడిగో, అడగకుండానో, యెంత చాకిరీచేసినా నేనేమంత పాటించేవాణ్నికాదు. కాని, నాకెప్పుడైనా కొంచెం తలనొప్పిగావుండి మంచంయెక్కానో ఆనాడు చూడాలి మా ఆవిడ నాకు చేసేసేవ అంతాను. ఆసేవకు పరిమితిలేదు. ఇంతా అంతా అనడానికి నా వశంకాదు. కాగా ఆసేవలు చేయించుకోలేక నాకు తలనొప్పి జాస్తీఅయ్యేది. వద్దన్నానో దానికి కోపం. చేయించుకోడానికా అంటే నాకు చీకాకు.

అలాంటి పరిస్థితే ఒకదఫా మా ఆవిడతో నాకు తటస్థించింది. పురుషులకు అనారోగ్యంగా వున్నప్పుడు సేవచేసే అనేకమంది సేవకులలో భార్యనుమించిన మరెవరూ వుండరని నిస్సంశయంగా చెప్పొచ్చు. శుచిగా లేకపోతేనే అనారోగ్యత కలుగుతుందని, శుచిగావుండాలంటే పదిదఫాలు చేతులు-కాళ్లు కడుగుకుంటూ వీలైనన్నిమార్లు స్నానాలు చేస్తూ మడిగావుండాలని మా ఛాందసపు భార్యామణిగారి అభిప్రాయం. తాను యెన్నిదఫాలు స్నానాలుచేసినా, తోమిందేతోమి, పామిందేపామి, ఆచారం, శుచిశుభ్రతనటించినా, నాకేమంత ఖాతరు లేకపోయేది కాని నన్ను తనప్రకారం నడుచుకోమంటేనే మా యిద్దరికివచ్చేది కొట్లాట నిత్యమూను.

ఒకనాడు నాకు తీవ్రంగా ఉష్ణంవచ్చింది. మలేరియాగాబోలు. ఒణుకుతూ పడుకున్నాను. నామీద మా ఆవిడ అటువంటి పరిస్థితిలో యెటువంటి ఆప్యాయత, అభిమానం కనుబరచాలో తన ఆచారప్రకారం అంతా ప్రారంభించింది వరుసతప్పకుండా.

'నిద్రా యేమిటి?'

'లేదు యింకా.'

'నిద్రలేపాలాను గాబోలు పాడు చచ్చిందాన్ని'

'మేలుకునేవున్నా నంటున్నానుగా.'

'కొంచెం పాలుత్రాగుతే బాగుండునేమో!'

'ఏమో!'

'తెచ్చాను. ఇవిగో!'

'ఉహు నాకొద్దు.'

'సోడాపాలు కలిపియిచ్చేదా?

'వద్దు'

'పోనీ ఒక్కసోడా త్రాగుతారా?'

'ఛా-పో వద్దంటూవుంటేను.'

USE ALWAYS "PALACE" BAR SOAPS.

'నోరెండుతుందండి.'

'నాకు తెలుసునులే.'

'పాలు వెచ్చబెట్టితెచ్చేదా?'

'వద్దు. చల్లనివే కావాలి.'

'వెచ్చబెట్టితే బాగుంటుందండి.'

'సరే. నీకెలాబాగుంటే అలాగే యేడు.'

'రొట్టె తెచ్చేదా?'

'వద్దు. ముందు పాలు తెమ్మంటూవుంటే.'

'కొత్తిమీరిపచ్చడికూడా తెచ్చేదా?'

'నిన్నుతగలెయ్య! కొత్తిమీరపచ్చడెందుకే నీ బుర్రమీదికి?'

'ఉత్తరొట్టె యెలా తింటారండీ?'

'ఎలాగో యేడుస్తాను. నీయిష్టమేలాగో ఆలాగే చెయ్యి.'

'నాకు ఆపచ్చడి యిష్టమేనండి.'

'అయితే వంటింట్లోకిపోయి అది తింటూ కూర్చో, నన్ను విసిగించిచంపక.'

'పోనీ కొంచెం జావ త్రాగకూడదు?'

'నన్ను కాల్చుకుతినకుండా యిక్కడినుంచి వెళ్ళిపోకూడదు?'

'మీకు పాలో, నీళ్ళో, రొట్టో, జావో, యేదికావాలంటే అది యిచ్చేసి వెళ్లిపోదామని.

'చప్పున యేదో ఒకటియిచ్చి వెళ్ళిపోదూ.

'పాలు తెచ్చేదా?'

ఆసినీతాడుతెగా, మళ్ళా మొదటికివచ్చావు? నేను వాగలేను నీతో. నోరు యెండిపోతోంది. నాకు పాలుమాత్రమే కావాలి. లేదా సోడాయిస్తే చాలు. లేకపోతే సోడా-పాలుకలిపి. అలా కాకపోతే ఒక్కసోడా అయినాసరే. ఏమిస్తావో చప్పున తే. నాకు నిద్రవస్తోంది.'

'అబ్బ! వూరికే నోరెండుకు ఆలాగు? అట్లా అరుస్తే నోరెండదూ! అబ్బాయి లేచిపోతాడు మీ అరుపులతో కాస్సేపు వుండండి. జావచేసితెస్తాను.'

'ఇంతసేపూ నీయేడుపు అయింది. ఇక వాడి యేడుపా? ముండాదేముడు ముగ్గురిని బాగా కుదిర్చాడు. నీ పాలూవద్దు-సోడావద్దు; రొట్టేవద్దు-రొట్టిమీద పచ్చడీవద్దు; నా ముందునుంచి పో అవతలకు. చాలు తలనొప్పి యెగిరిపోయింది. ఇంత అభిమానం గలభార్య ఒక్కర్తెవుంటేచాలు, యెటువంటిరోగం అయినా రకీమని కుదిరిపోతుంది యేమందూ అక్కరలేకుండానే' అని నేను అంటూవుండగా—

అబ్బాయిని వొళ్ళోవేసుకొని మా ఆవిడ నాకెదురుగా దీనంగాకూర్చుంది.

ఇటువంటి అపూర్వ ప్రేమాభిమానాలుగల భార్యాతో యేమిచేయాలో తోచక నా కర్మాన్ని తిట్టుకుంటూ నేను కళ్లుమూశాను.


ఉర్దూ తెలుగు స్వబోధిని

పేజీలు 140

ఉర్దూ భాషను నేర్చుకొనవలెనను - అభిలాషకలిగినను ప్రతిఆంధ్రుడు మహమ్మదీయుడు తెలుగుద్వారా ఉర్దూనేర్చుకొనుటకు తగిన సులభమైన గ్రంథము.

వెల - 1-8-0
వి.పి.. 2-1-0

వలయువారు:-
శ్రీరామా బుక్ డిపో
మార్కెటువీధి, సికంద్రాబాద్.